క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్‌కు అధికారుల అభినందన



ఫొటోగ్రాఫర్‌ను అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల: మల్యాల మండలానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ మండలోజు శ్రీనివాస్ తన ఛాయ చిత్ర ప్రతిభకు ఆర్ట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ కలకత్తా వారు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రఫీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

కథలాపూర్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీ వాల్ పోస్టర్‌ను ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సద్దుల వినయ్ బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని, యువత, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జవ్వాజి చౌదరి, ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు ఆకుల సంతోష్, నాయకులు దొమ్మాటి అర్జున్, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

కవితను కలిసిన జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు



ఎమ్మెల్సీ కవితతో మల్లేశ్

మల్లాపూర్: ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితను జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు నిజామాబాద్‌లోని ఆమె స్వగృహంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కవితకు వినతిపత్రం అందించినట్లు మల్లేశ్ తెలిపారు. అనంతరం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరేలా పనిచేయాలని ఎమ్మెల్సీ కవిత జాగృతి నాయకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తుమ్మ గంగాధర్, పోతారపు రమేశ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణి చెరువులో శ్రమదానం



చెరువులో శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

ధర్మపురి: స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా బుధవారం పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో స్థానిక చింతామణి చెరువులో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా చెరువులో పేరుకు పోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెలను పొక్లెయిన్‌తో తొలగించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రామన్న, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడిబాట విజయవంతం చేయాలి

జగిత్యాల: బడిబాటను విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తామన్నారు. మన ఊరు మన బడి పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేసి సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు, బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ పాల్గొన్నారు.

పునరావాస గ్రామం సమస్యలతో సతమతం

- పరిహారం కోసం సంగెం -శ్రీరాంపూర్ గ్రామస్తుల ఎదురుచూపు
- పంటలకు అందని సాగునీరు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- ఇబ్బందుల్లో గ్రామస్తులు





సంగెం–శ్రీరాంపూర్‌లో డ్రెయినేజీలు లేని అంతర్గత రహదారులు

మల్లాపూర్: మండలంలోని ఎస్సారెస్పీ పునరావాస గ్రామం సంగెం–శ్రీరాంపూర్ సమస్యలతో సతమతమవుతోంది. గ్రామంలో సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో అంతర్గత రహదారులకు డ్రెయినేజీల నిర్మాణం, మండల కేంద్రానికి లింక్‌రోడ్డుకి బీటీ రోడ్డు, వ్యవసాయానికి సాగు నీరు, డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరు, ఎస్సారెస్పీ నుంచి సాగునీరు, ఆలయాల అభివృద్ధి, శాఖ గ్రంథాలయం ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారం కోసం ఏళ్లుగా విన్నవించుకుంటున్నా.. పాలకులు, అధికారులు స్పందించి పరిష్కంచడం లేదని వాపోతున్నారు.

గ్రామంలో ప్రధాన సమస్యలు..

- ఎస్సారెస్పీ డీ–29 కాలువకు మరమ్మతులు చేయించి ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే నీటిని సంగెం–శ్రీరాంపూర్‌లో వ్యవసాయ భూములకు సాగుకు నీరందించాలి.
- సంగెం–శ్రీరాంపూర్ శివారులోని గోదావరి నది వద్ద శివాలయంను ప్రభుత్వం గుర్తించి నిర్మాణం పూర్తి చేయడం, కల్యాణ మండపం నిర్మించాలి
- గ్రామపంచాయతీ పరిధిలో అంతర్గత రహదారులకు డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది.
- అంతర్గత రహదారులపైకి మురుగునీరు ప్రవహించడంతో చెత్తాచెదారాలు, దుర్గంధంతో ప్రజలు అనారోగ్యానికి గురై సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు.
- సంగెం–శ్రీరాంపూర్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. అర్హులైన నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచుస్తున్నారు.
- నిరుద్యోగ యువత కోసం గ్రామంలో శాఖగ్రంథాలయం ఏర్పాటు చేయాలి.
- సంగెం–శ్రీరాంపూర్ నుంచి మల్లాపూర్‌కు లింక్ రోడ్డును అభివృద్ధి చేసి బీటీరోడ్డుగా మార్చాలి.
- గోదావరి నది నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా తాగు, సాగు నీరందించాలి.
- గ్రామపంచాయతీ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాల్సి ఉంది.
- ముంపు గ్రామానికి హామీ ఇచ్చినట్లుగా యువతకు ఎస్సారెస్పీ ఉద్యోగ అవకాశాలను కల్పించాలి.
- గ్రామంలోని పలుకాలనీల్లో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలకు కరెంట్ సేవలు అందడం లేదు.

సంగెం–శ్రీరాంపూర్ గ్రామ వివరాలు	
జనాభా :	680
పురుషులు :	317
స్త్రీలు :	363
ఓటర్లు :	510
వార్డులు :	8
కుటుంబాల సంఖ్య :	350

డీ–29 కాలువతో సాగునీరందించాలి



ఎస్సారెస్పీ డీ–29 కాలువకు మరమ్మతులు చేయించి ఆయకట్టు గ్రామం సంగెం -శ్రీరాంపూర్‌కి సాగునీరు అందించాలి. ప్రతియేడు సాగుకు నీరందక ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఎండిపోయి రైతులకు తీరని నష్టం ఏర్పడుతోంది.

– చిన్నాగౌడ్, సంగెం–శ్రీరాంపూర్

సమస్యలు పరిష్కరించాలి..



గ్రామంలో ఏళ్లుగా పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్న. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు శ్రమిస్తున్నా. పునరావాస గ్రామంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలి.

– పాలేపు దిలీప్, సర్పంచ్, సంగెం–శ్రీరాంపూర్

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉర్దూ ఘర్ కోసం ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. హజ్‌యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఎంఏ.బారీ, రియాజ్ మామ, రియాజ్‌ఖాన్, జమీల్, ముఖీం, సోహెల్ పాల్గొన్నారు.



హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే

ఎల్‌వోసీ అందజేత

పట్టణంలోని 39వ వార్డుకు చెందిన లావణ్యకు అనారోగ్యానికి గురికాగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం రూ.లక్ష ఎల్‌వోసీని అందజేశారు.

అనారోగ్యానికి కారణం పొగాకు

అనారోగ్యానికి కారణం పొగాకు అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పట్టణానికి చెందిన సామాజికవేత్త రాంచంద్రం రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పొగాకు వాడకం వల్ల నోటిక్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ లాంటి అనేక రోగాలకు ప్రజలు బలి అవుతున్నారన్నారు. దీనిని అరికట్టాలిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుమన్, ధనుంజయ్, అశోక్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజంతోనే దేశాభివృద్ధి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: ఆరోగ్యకరమైన సమాజంతోనే దేశాభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్వైత హాస్పిటల్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసిన యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొడ్డు రాజేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కల్వకుంట్ల సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీపీ కాటిపెల్లి సరోజన,ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా సభ్యుడు దేవ మలయ్య, మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మన్నెగూడెంలో ఆరోగ్యసర్వే

కథలాపూర్: భీమారం మండలం మన్నెగూడెంలో కరీంనగర్‌కు చెందిన చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ఆరోగ్య సర్వే చేపట్టారు. వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఉపసర్పంచ్ సావిత్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఏర్పాటు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం ధర్మారంలో శ్రీకృష్ణ యాదవ సంఘం గ్రామ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాక మల్లేశం, ఉపాధ్యక్షుడిగా పరమల మల్లేశం, కోశాధికారిగా కొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజయ్య, మల్లేశ్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

కట్లకుంట హెచ్‌ఎంగా శ్రీధర్

కథలాపూర్: మేడిపెల్లి మండలం కట్లకుంట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఎనగందుల శ్రీధర్‌ను నియమిస్తూ డీఈవో జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం సత్యనారాయణ జిల్లా సెక్టోరియల్ అధికారిగా డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో హైస్కూల్‌లో సీనియర్ టీచర్ శ్రీధర్‌కు హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అంటరానితనం నిర్మూలించాలి

జగిత్యాలరూరల్: అంటరానితనం నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రూరల్ తహసీల్దార్ నవీన్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం నేరమని, ఎవరి హక్కులను భంగం కలిగించినా నేరమేనన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రణీత్, సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి:చట్టాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎస్సై కుమారస్వామి అన్నారు. మండలంలోని నందగిరిలో బుధవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. కుల వివక్షతను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ ఒకరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాకేశ్, ఆర్ఐ శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజం, స్థానికులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రజలందరు కుల, మతాలకు అతీతంగా ఐక్యమత్యంతో జీవించాలని తహశీల్దార్ రవీందర్,ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అంటరానితనం, వ్యక్తిగత దూషణలు చేసుకోకుండా అందరు ఐక్యమత్యంతో జీవించాలని ఆకాంక్షించారు. సమావేశంలో సర్పంచ్ సాయికుమార్, ఎంపీటీసీ మైసలక్ష్మీ, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



చిట్టాపూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

రాయికల్: మండలంలోని మక్యానాయక్‌తండాలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ కాంతయ్య మాట్లాడుతూ కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారి పాల్గొన్నారు.


విద్యతోనే అంటరానితనం నిర్మూలన

వెల్గటూర్: విద్య వల్లనే అంటరానితనాన్ని నిర్మూలించవచ్చని ఆర్ఐ రాజేశ్వరి అన్నారు. మండలంలోని రాంనూర్‌లో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదువుకోవాలని, చదువుతో విజ్ఞానం పెరుగుతుందని, అంటరానితనం తొలగిపోతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో ప్రమాదకర వ్యాధులు

మల్యాల: పొగాకు వినియోగం అన్ని అనార్థాలకు మూలమని, క్యాన్సర్ కారకం పొగాకేనని, ప్రజలు అవగాహన పెంపొందించుకుని, పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని వైద్యాధికారి మౌనిక అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆస్పత్రికి వచ్చిన రోగులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ మణి మాధురి, పర్వీన్, సరిత, ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకుతో కలిగే అనర్థాలను అధికారులు వివరించారు.కార్యక్రమంలో వైద్యాధికారులు సింధూజ, శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



మల్యాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఇబ్రహీంపట్నం: పొగాకు తాగడం ప్రమాదకరమని వైద్యాధికారి శ్రీజ అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో, గోదూర్ ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పొగాకు వినియోగంతో వచ్చే వ్యాధులను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ ప్రభాకర్, సీహెచ్‌వో విజయభాస్కర్, స్టాఫ్ నర్సు రాజేందర్, ఫార్మాసిస్ట్ ఉదయ్‌ప్రసాద్, నరేశ్, దీపిక, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వడ్డెరలకు ఆర్థిక సహకారం ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్లటౌన్: ప్రభుత్వం వడ్డెర వృత్తి దారులకు ఆర్థిక సాయం రూ.1 లక్ష అందించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కుంచం శంకర్, కో కన్వీనర్ సాయి రెడ్డి బుధవారం పేర్కొన్నారు. చేతి వృత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఒడ్డెర వృత్తి పనివారిని గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర వృత్తి దారులను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా ఆర్థిక సాయం అందించేందుకు జాబితాలో స్థానం కల్పించాలని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బోనాల్లో ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ పూజలు



సన్మానిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లిలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో బుధవారం బోనాల జాతర మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రెడ్డి రత్న, నాయకులు రవి, గంగాధర్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు టీటీడీ చైర్మన్ సన్మానం

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్‌ను టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి శాలువాతో సన్మానించారు.

ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరు..

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పలు దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్ కొండ శ్రీలత, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

ఇబ్రహీంపట్నం : తప్ప, తాలు పేరుతో రైతుల వద్ద రైస్‌మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని ఎర్దండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతు అప్పులు చేసి కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నారని అన్నారు. ఒక క్వింటాలుకు 7 నుంచి 8 కిలోలు అధికతూకం వేస్తూ దోపిడీ చేస్తున్నారని అన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి 20 రోజులైనా డబ్బులు జమ చేయడం లేదని, వెంటనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లారీలు కొరత తీర్చాలని సివిల్ సప్లై డీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సక్క, నాయకులు దాసరి రాజశేఖర్, దాసరి రాజేందర్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం రైతులు పాల్గొన్నారు.



ఎర్దండిలో ధాన్యం పరిశీలిస్తున్న కృష్ణారావు

రైతు సమస్యలపై సైకిల్ యాత్ర

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ రైతుల సమస్యలను తెలుసుకోవడానికి సైకిల్ యాత్ర చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త మోతె నరేశ్ తెలిపారు. ఎండపల్లి మండలం అంబరిపేటకు చెందిన మోతె నరేశ్ మే 27న అంబరిపేటలో ప్రారంభించిన సైకిల్ యాత్ర ఎండపల్లి, ధర్మారం, పెగడపల్లి మండలాల మీదుగా సాగి బుధవారం వెల్గటూర్ మండలానికి చేరింది. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మిల్లర్లు క్వింటాలుకు 8 కిలోలు తరుగు పేరిట దోచుకుంటుంటే మంత్రి కొప్పుల ఈశ్వర్ రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అడ్డగోలుగా మిల్లర్లు దోచుకుంటుంటే మిల్లర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎటువంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధ్యత వహించాలని నరేశ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ధర్మపురికి చేరిన సైకిల్ యాత్ర

ధర్మపురి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి సామాజిక కార్యకర్త మోతె నరేశ్ చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం ధర్మపురికి చేరింది. మండలంలోని రాయపట్నం, రామయ్యపల్లెలో రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించి 40 రోజుల గడుస్తున్నా ఇంతవరకు పూర్తి చేయలేదని అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పాశిగామలో రైతులతో మాట్లాడుతున్న నరేశ్

పేదింటి అమ్మాయిల వివాహాలకు దాతల సాయం

మల్లాపూర్: పేదింటి అమ్మాయి వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు చేయూతనందించారు. మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన సాత్విక పెళ్లికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో వివాహానికి కావాల్సిన సామగ్రి అందించారు. పుస్తెమెట్టెలు, స్టీల్ సామగ్రి, పెళ్లికి పట్టుచీర, 300 మందికి భోజనాలకు కావాలిన బియ్యం, వంటసరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొత్తదాంరాజుపల్లిలో..

మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో నిరుపేద కుటుంబమైన ఇల్లెందుల రాజేష్–లక్ష్మి దంపతుల కుమార్తె రాజేశ్వరి వివాహానికి కోరుట్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాంప్రసాద్, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



చీర, సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఆసునూరిగూడెంలో ఇళ్లు కోల్పోయిన రెండు కుటుంబాలకు బుధవారం రెండు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రూ. 30 వేల విలువ చేసే సాయం అందించారు. అగ్ని ప్రమాదంలో ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో జగిత్యాల సత్యసాయి అభయహస్తం వారు బట్టలు, వంట పాత్రలు, దుప్పట్లు, రూ. 8 వేల నగదు అందించగా, జగిత్యాల పరమేశ్వర సేవా సమితి వారు నిత్యావసర (కిరాణ సామగ్రి) అందించారు. వీటి విలువ మొత్తంత రూ. 30 వేల వరకు ఉంటుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి అభయ హస్తం సభ్యులు, పార్వతి పరమేశ్వర సేవా సమితి సభ్యులు ఎంపీపీ మసర్తి రమేష్, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, నాయకులు పాల్గొన్నారు.

కుమ్మరిపల్లిలో పోచమ్మతల్లి ఊరేగింపు



పోచమ్మతల్లి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అమ్మవారిని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు, ఉపసర్పంచ్ బొంగు రాజు, మహిళలు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.